క్లుప్తంగా

పోలీసుల తనిఖీ



వెంకటాపురం (కె) : మండల కేంద్రంలోని శివాలయ సమీపంలో ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. భద్రాచలం, చర్ల, వాజేడు, ఏటూరునాగారం మండలాల నుంచి రాకపోకలు సాగిస్తున్న వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితుల వివరాలు సేకరించి సమగ్ర విచారణ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


మంగపేట : మండలంలోని చుంచుపల్లి–పాలాయిగూడెం గ్రామాల మధ్య ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డు దాటుతున్న ట్రాక్టర్ ట్రాలీని ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో చుంచుపల్లి గ్రామానికి చెందిన పూసం విష్ణువర్ధన్ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా.. విష్ణువర్ధన్ రాజుపేట వైపు నుంచి తన ద్విచక్ర వాహనంపై చుంచుపల్లికి వస్తుండగా చుంచుపల్లి వైపు నుంచి పాలాయిగూడెంకు చెందిన రైతు తన ట్రాక్టర్‌లో పండు మిర్చీ బస్తాలను కల్లంలోకి తీసుకెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా ట్రాక్టర్ ట్రాలీకి ఢీకొన్నాడు. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న విష్ణువర్ధన్ తలకు బలమైన గాయాలై అపస్మారక స్థితిలో పడి ఉన్న విష్ణువర్ధన్‌ను స్థానికులు 108లో ఏటూరునాగారం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు బాధితుడిని వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

పరామర్శ



ములుగు రూరల్ : మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన మురారి రామచంద్రం అనారోగ్యంతో సోమవారం మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను జెడ్పీటీసీ తుమ్మల హరిబాబు సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఆయన రూ.3 వేలు సాయం అందించారు. తొలుత రామచంద్రం మృతదేహానికి నివాళులర్పించారు. జెడ్పీటీసీ వెంట నాయకులు మంచికలపూడి కళ్యాణ్ తదితరులున్నారు.

‘తెలంగాణ దారి దీపాలు’లో ఆలం లక్ష్మయ్యకు చోటు



వాజేడు : డాక్టర్ గంటా జలంధర్‌రెడ్డి సంపాదకత్వంలో తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి ప్రచురించిన ‘తెలంగాణా దారి దీపాలు’ గ్రంథంలో మండలానికి చెందిన విద్యావేత్త ఆలం లక్ష్మయ్యకు చోటు లభించినట్టు ప్రముఖ పరిశోధక రచయిత డాక్టర్ అమ్మిన శ్రీనివాస రాజు మీడియాకు తెలిపారు. ఆయన వివరాలను సోమవారం వెల్లడించారు. ఆలం లక్ష్మయ్య జీవిత విశేషాలను ఆ గ్రంథంలో పొందుపర్చారని పేర్కొన్నారు. గ్రంధాన్ని హైదరాబాద్‌లో ఈనెల 18న (మంగళవారం) ఆవిష్కరించనున్నారని తెలిపారు. గ్రంథంలో తెలంగాణకు చెందిన వివిధ రంగాల్లో సేవలు అందించిన మహనీయుల జీవన ప్రస్థానాలను మండలి ప్రచురించినట్టు తెలిపారు.

సముచిత స్థానం కల్పించాలి

మల్హర్: కాళేశ్వర దేవస్థానం కమిటీలో జిల్లా దివ్యాంగులకు సముచిత స్థానం కల్పించాలని జిల్లా దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణగౌడ్ ప్రభుత్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ దివ్యాంగులకు అన్ని విధాల సముచిత స్థానం కల్పిస్తామని పలు సందర్భాల్లో ప్రకటనలు చేసినట్లు గుర్తు చేశారు. ఈమేరకు కాళేశ్వర దేవస్థానంలో దివ్యాంగులకు కమిటీ మెంబర్‌గా అవకాశం కల్పించాలని కోరారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని తెలిపారు.

ఆర్థిక సాయం

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన గంగాధర రాజు ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మృతుడి చిన్ననాటి మిత్రులు పరామర్శించి రూ.17,500 నగదును అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కట్కూరి పద్మా నరేందర్, బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్ గౌడ్, పెరుమాండ్ల రాజు, బుర్ర సాంబశివుడు, బైరం రామకృష్ణ, బుర్ర నాగరాజు, తాటిపల్లి శ్రీనివాస్, మహేందర్, రాజు, ఎండీ సాజిద్, వెల్దండి సత్యం, ఉయ్యాల రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబురాలు



వెంకటాపురం : ముగ్గులు వేస్తున్న యువతులు



ఏటూరునాగారం : ఇళ్ల ఎదుట ముగ్గేస్తున్న మహిళలు



ఏటూరునాగారం : ముస్తాబైన ఎడ్లబండి



మంగపేట : ఇంటి ముందు ముగ్గు వేస్తున్న యువతి

ఏటూరునాగారం/మంగపేట : ఏటూరునాగారం, మంగపేట మండలాల్లో అన్ని వర్గాల ప్రజలు తెలుగింటి సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా జరుపుకునే భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజుల పాటు పండుగను ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. బాలికలు, యువతులు వయోభేదం లేకుండా అన్ని వయస్కుల మహిళలూ ఇళ్ల ఎదుట రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించారు. గుమ్మాలను, ఇంటినీ మామిడాకులు, ఇతర సరంజామాతో ముస్తాబు చేశారు. మండల కేంద్రాల్లో, గ్రామాల్లోనూ పండుగ శోభ కళ్లకు కట్టింది. గంగిరెద్దుల వారి విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మహిళలు తెల్లవారక ముందే ఇళ్ల ఎదుట ముగ్గులు వేస్తూ పండుగకు స్వాగతం పలికారు. ఆడబిడ్డలు పండుగకు తల్లిదండ్రుల ఇళ్లకు రావడంతో పల్లెల్లో పండగ జోరు కొనసాగింది. ఇంటింటా పిండి వంటల ఘుమఘుమలు జనాన్ని నోరూరించాయి. ఎడ్లబండ్లను రైతులు ముస్తాబు చేశారు. ఆవులను, ఇతర పశువులను పాడిరైతులు ప్రత్యేకంగా పూజించారు. ఇంటిల్లిపాదీ నూతన వస్త్రాలు ధరించి సందడి చేశారు. బాలురు, యువకులు పతంగులు ఎగరేస్తూ కేరింతలు కొట్టారు. మండల కేంద్రంలోని 5వ వార్డులో తమిళనాడుకు చెందిన చెన్నై వలసవాసులు ప్రత్యేక పొంగలి తయారు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

వెంకటాపురం(ఎం) : మండలంలో ప్రజలు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇళ్ల ఎదుట అందమైన ముగ్గులు వేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ కనుమ సందర్భంగా రైతులు పశువులను పసుపు, కుంకుమ పెట్టి అలంకరించి పూజించారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

ఏటూరునాగారం : క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ టౌన్ కమిటీ అధ్యక్షులు బండారు లక్కీ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి షటిల్ టోర్నమెంట్ ఫైనల్స్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన జట్టుకు కప్‌తోపాటు రూ.10,116లు నగదు అందజేశారు. అలాగే రన్నర్స్ జట్టుకు మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ ఖాన్ వీ మార్ట్ ద్వారా రూ.2,016లుతోపాటు కప్ అందజేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడారు. యువత క్రీడాపోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, ఎంపీటీసీ గుడ్ల శ్రీలత దేవేందర్, నాయకులు ఖలీల్, చిన్న ఎల్లయ్య, సులేమాన్, మామిడి రాంబాబు, సునారికాని శ్రీను, నెగరికంటి ముతేశ్, ముస్తఫా, ఖయ్యూమ్, చేరాలు తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో నాయకులు, నిర్వాహకులు

ఘనంగా వీరభద్రుడి ఊరేగింపు



ఏటూరునాగారం : మండల కేంద్రంలోని శ్రీ అభినవ వీరభద్ర స్వామి, భద్రకాళి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంలో డప్పుచప్పుళ్లతో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. దేవతలను భక్తులు దర్శించుకొని ప్రత్యేక కానుకలు, నీళ్లు ఆరగించి స్వాగతం పలికారు. స్వామి వారి అమ్మవార్ల ఆశీర్వాదం తీసుకున్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

మంగపేట : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని మల్లూరులో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గ్రామానికి చెందిన 18 మంది మహిళలు, యువతులు పాల్గొనగా ప్రథమ బహుమతిని రెడ్డి సుప్రియ గెల్చుకోగా ఆమెకు రూ.1,500లు, రెండో బహుమతిని కోడం పూజ గెల్చుకోగా ఆమెకు వెయ్యి రూపాయలు, మూడో బహుమతిని అబ్బు నవ్య గెల్చుకోగా ఆమెకు రూ.500లు హైదరాబాద్‌లో స్థిరపడ్డ గ్రామస్తురాలు కాకర్ల స్వాతి అందించారు. అలాగే పోటీల్లో పాల్గొన్న మహిళలకు గ్రామానికి చెందిన కుంచనపెల్లి అశోక్ ప్రోత్సాహకంగా కుంకుమ భరిణెతోపాటు రూ.116లు బహూకరించారు. కార్యక్రమంలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కార్యనిర్వాహణ అధికారి సత్యనారాయణ, ఆలయ మాజీ చైర్మన్ చిట్యాల పురుశోత్తం, అర్చకులు రాజీవ్ నాగఫణి శర్మ, మారబోయిన గోవర్దన్, చిన్నాల చక్రాధర్, కోలాచలం రాంచందర్, నూతులకంటి అజయ్ తదితరులు పాల్గొన్నారు.



సుప్రియకు మొదటి బహుమతిగా నగదు అందజేస్తున్న స్వాతి, ఈఓ సత్యనారాయణ

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం

ఏటూరునాగారం : మండలంలోని ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ సంజీవ తెలిపారు. మండల కేంద్రంలో సర్పంచ్ ఈసం రామ్మూర్తి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సదస్సులో పలువురి నుంచి వినతిపత్రాలను తహసీల్దార్ స్వీకరించి మాట్లాడారు. వారసత్వ భూమార్పిడి, ధరణిలో నెలకొన్న సమస్యలు, తదితరాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకాల మంజూరీలో జాప్యం ఉంటే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజలు నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో లేదా మీసేవ కేంద్రం ద్వారా వినతిపత్రాలు అందజేయవచ్చని వివరించారు. మండలంలోని ఆకులవారి ఘణపురం, మానసపల్లి దరఖాస్తులను ధరణి పోర్టల్ ద్వారా పరిష్కరించడంతోపాటు సాదాబైనామా దరఖాస్తులను కూడా పరిశీలిస్తామన్నారు. భూవివాదాలను సైతం పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుడ్ల శ్రీలత దేవేందర్, ఉపసర్పంచ్ కర్ల అరుణ, వార్డు సభ్యుడు రమేశ్ పాల్గొన్నారు.



ఏటూరునాగారం : సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సంజీవ

వెంకటాపురం (కె) : మండలంలోని ఉప్పేడు వీరాపురం గ్రామ పంచాయతీలో సర్పంచ్ సూరిబాబు అధ్యక్షతన సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న భూసమస్యలపై రైతులు, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంటి నాగరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



వెంకటాపురం (కె) : ఉప్పేడులో..

ఆరుగురిపై కేసు నమోదు

పలిమెల: కోడిపందేలు నిర్వహిస్తున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పంకేనలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందెలు నిర్వహిస్తున్నారని పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.1080, రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వారిలో ముగ్గురు పంకేన గ్రామానికి చెందిన వారు కాగా, మరో ముగ్గురు లెంకలగడ్డకు చెందిన వారుగా గుర్తించినట్లు వెల్లడించారు. మండలంలోని కోడి పందెలు, పేకాట, తదితర అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

మహదేవపూర్ : మండలంలోని ఎనకపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో కోళ్లపందెల స్థావరంపై ఎస్ఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసుల దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2500 నగదు, 4 పందెం కోళ్లు, 2 కత్తులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ, లింగాల అంగన్‌వాడీ కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి సామ్యూల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కోటంచ అంగన్‌వాడీ కేంద్రం(1)లో టీచర్, లింగాలలో ముగ్గురు ఆయాలు విధులకు గైర్హాజరు కావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌తో ఫోన్‌లో మాట్లాడి విధులకు గైర్హాజరైన వారి ఒక రోజు వేతనాన్ని నిలిపి వేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ సురేందర్, సర్పంచ్, ఎస్ఎంసీ చైర్మన్లు ఉన్నారు.



వివరాలను సేకరిస్తున్న సామ్యూల్

దళిత శక్తి ప్రోగ్రాం ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ

మొగుళ్లపల్లి: మండలంలోని పెద్దకోమటిపల్లి గ్రామంలో విశారదన్ మహారాజ్ చేపట్టిన పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్రకు సంఘీభావంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం దళిత శక్తి ప్రోగ్రాం ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. గ్రామంలోని అన్నివర్గాల ప్రజలు పాల్గొని సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యులు మంద రమేష్ మహారాజ్, మండల అధ్యక్షుడు జన్నే లక్ష్మణ్ మహారాజ్, మండల ప్రధాన కార్యదర్శి దూడపాక రాజు మహారాజ్, దూడపాక శ్రీకృష్ణ మహారాజ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



సంతకాల సేకరణలో పాల్గొన్న నాయకులు

స్కూల్ సమీపంలో ‘దహనం’ చేయొద్దు

గణపురం: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్, కస్తూరిబా పాఠశాలల సమీపంలోని గణపసముద్రం చెరువు శిఖంలో దహన సంస్కారాలను చేయొద్దని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ శ్రీనివాస్‌కు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రేపాక రాజేందర్ మాట్లాడుతూ.. మండలకేంద్రంలోని కోటగుళ్ల సమీపంలో దాతల సహాయంతో 3 ఎకారల భూమిని కొనుగోలు చేసి సుమారు రూ.15 లక్షలతో స్మశాన వాటికను నిర్మించినట్లు తెలిపారు.అక్కడ దహన సంస్కారాలు చేయకుండా మోడల్ స్కూల్, కస్తూరిబబాగాంధీ, బీసీ హాస్టల్ నిర్వహిస్తున్న సమీపంలో చేయడంతో విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. అంతేకాకుండా గణపురం–గాంధీనగర్ ప్రధాన రహదారిలో గణపసముద్రం కట్ట వద్ద దహన సంస్కారాలు చేపడుతన్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఓరుగంటి కృష్ణ, మండల నాయకులు మామిండ్ల మల్లికార్జున్ గౌడ్, స్థానిక వార్డు సభ్యులు మామిండ్ల మల్లేష్, గంధం ఓదాకర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పంచాయతీ ఆదాయానికి గండి

ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని మేడారంలో అటవీ శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వల్ల గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి పడుతోందని సర్పంచ్ బాబురావు తెలిపారు. అటవీ శాఖ చెక్‌పోస్ట్ వద్ద ఆ శాఖ అధికారులతో ఆయన సోమవారం మాట్లాడారు. మేడారంలో వైల్డ్ లైఫ్ సాంక్చువరీ ఎన్విరాన్‌మెంట్ మెయింటెనెన్స్ చార్జీల వసూలు కోసం అటవీ శాఖ అధికారులు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి మేడారానికి వచ్చే వాహనదారుల నుంచి చార్జీలు వసూలు చేస్తున్నారని చెప్పారు. పంచాయతీ అధ్వర్యంలో మేడారంలో పారిశుధ్య పనుల నిర్వహణ కోసం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గతేడాది టోల్‌గేట్ ఏర్పాటు చేశామన్నారు. అటవీ శాఖ చెక్‌పోస్టు, గ్రామ పంచాయతీ టోల్‌గేట్‌కు మధ్య 100 మీటర్ల లోపే దూరం ఉండటంతో అటవీ శాఖ అధికారులకు చార్జీలు చెల్లించిన వాహనాదార్లు గ్రామ పంచాయతీ టోల్‌గేట్ వద్ద చార్జీలు చెల్లించకుండా సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారని చెప్పారు. అటవీ శాఖ చెక్‌పోస్ట్‌తో గ్రామ పంచాయతీ ఆదాయం కోల్పోతున్నామని, పారిశుధ్య కార్మికులు వేతనాలు చెల్లించడం కష్టమౌతోందని ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. అటవీ శాఖ చెక్‌పోస్ట్ వద్ద చార్జీల వసూలు నిలిపివేయాలని కోరారు. లేనిపక్షంలో తాడ్వాయి ఎంట్రెన్స్ సమీపంలో అటవీ శాఖ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అలా సాధ్యం కాని పక్షంలో మేడారం గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాలన్నారు. జిల్లా ఉన్నతాధికారులు అటవీ శాఖ అధికారులు సమీక్షించి గ్రామ పంచాయతీ ఆదాయనికి గండి పడకుండా చూడాలని ఆకాంక్షించారు.



అటవీ శాఖ అధికారులతో మాట్లాడుతున్న సర్పంచ్ బాబురావు

పోద్దాడు పారట్లే.. ప్రభుత్వం ఆదుకోవాలి

ములుగు రూరల్ : పోద్దాడు కల్లు పారట్లేదని.. ఈ పరిస్థితుల్లో గీత కార్మికులను ప్రభుత్వం రూ.50 వేలు చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గుండబోయిన రవిగౌడ్ కోరారు. మండలంలోని నర్సాపూర్ గ్రామంలోని గీత కార్మికులు సోమవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడారు. ఏటా డిసెంబర్ నెలాఖరు లేదా జనవరి మొదటి వారానికల్లా పోద్దాడు కల్లు విపరీతంగా పారేదని తెలిపారు. ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాల వల్ల నెల రోజులు గడచినా పోద్దాడు కల్లు పారడం లేదని చెప్పారు. గీత కార్మికులు వృత్తిని కోల్పోయి కుటుంబ పోషణలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పంటల బీమా తరహాలో తాటి, ఈత చెట్లకు బీమా కల్పించాలని, కల్లు పారకపోవడాన్ని ప్రకృతి వైపరీత్యంగా పరిగణించి గీత కార్మికులందరికీ పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీహరి, జగదీశ్, కనకయ్య, రవిందర్, శ్రీధర్, శోభన్, రమేశ్, లాలయ్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన వ్యక్తం చేస్తున్న గీత కార్మికులు

కంటి వెలుగును విజయవంతం చేయండి

వాజేడు : రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి మహేందర్ ప్రజలను, ప్రజాప్రతినిధులను కోరారు. ఆ కార్యక్రమ కరపత్రాలను మండలంలోని నాగారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ తల్లడి ఆదినారాయణకు వైద్య సిబ్బందితో కలిసి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంచిపెట్టారు. కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు వినియోగించుకోవాలని వైద్యాధికారి మహేందర్ కోరారు.



సర్పంచ్‌కు కరపత్రం అందజేస్తున్న వైద్యాధికారి

క్రీడలతో మానసికోల్లాసం

మల్హర్: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక ధృడత్వం లభిస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. మండలంలోని వల్లెకుంట అనసూయమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు మండలాల కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సునీల్‌రెడ్డి సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. కాటారం జట్టు ప్రథమ స్థానంలో నిలువగా రూ.10వేలు, బొమ్మాపూర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలువగా రూ.5వేల నగదును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత చదువులతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు మల్కా మోహన్‌రావు, పిలుమారి సంపత్, కొయల్కార్ నిరంజన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీధర్, కిషాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బండం మల్లారెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు ఆజ్మీర నవీన్, మండల ప్రధాన కార్యదర్శులు ఇండ్ల అశోక్, పుసాల రాజేందర్, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ మహేందర్ ఉన్నారు.

మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెం గ్రామంలో గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామస్తుల ఆధ్వర్యంలో షెటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్ సోమవారం ముగియడంతో క్రీడాకారులకు బీఆర్ఎస్ నాయకులు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ.2016, ద్వితియ బహుతితో పాటు షీల్డ్‌లును అందజేశారు. కొండాల్ రెడ్డి, ముదురుకోళ్ల రవి, భూక్యా రాజేందర్, సురేష్, రవి, రఘువీర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడలు ప్రారంభం

మండలంలోని పెగడపల్లి గ్రామంలో సోమవారం పుట్టలింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలస్థాయి వాలీబాల్ క్రీడోత్సవాలను నిర్వహించారు. ఈ క్రీడలను సర్పంచ్ వినోద జగపతి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. క్రీడాపోటీలను వినియోగించుకోవాలని సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకే పోటీలు నిర్వహించినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జైపాల్‌నాయక్, గ్రామశాఖ అధ్యక్షుడు రామగిరి దుర్గయ్య, ఎంపీటీసీ వసంత రూపా నాయక్, జగపతినాయక్, గంట కొండాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

మహాముత్తారం: మండలంలోని కోనంపేట గ్రామానికి చెందిన గావిడి నవ్య అనే మహిళా పురిటినొప్పులతో సోమవారం బాధపడుతున్న క్రమంలో కుటుంబసభ్యులు 108కు సమాచారం అందజేశారు. ఈ క్రమంలో వాహనంలో జిల్లా కేంద్రానికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో నొప్పులు రావడంతో సిబ్బంది వాహనంలో మహిళా ప్రసవించే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో మహిళా పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఎంటీ స్వామి, పైలెట్ శశి ఉన్నారు.

